# మను రాజ్యాల్లో  రచ్చబండయిన శర్మిళా రెగే

గోగు శ్యామల

రచయిత

29-7-2013

వర్తమాన సమాజంలోని మీడియా, సాహిత్యం, ఉద్యమాల పరంగానేగాక సామాజికంగా, రాజకీయంగా మరీ ముఖ్యంగా అకెడమిక్ డిబేట్లలో అత్యంత చర్చనీయ, ప్రభావశీల అంశాలుగా స్త్రీవాదం, దళితవాదం, పర్యావరణవాదం, మరియూ మూలవాసి వాదాలు  బహుముఖ కోణాలు కలగలిసినవిగా  నేడు విరాజిల్లుతున్నవి. ఇవన్నీ సాంస్కృతికంగా, చారిత్రికంగానే కాక పరస్పరం అవినాభావ సంబంధాన్ని కలిగి ఉన్నవి. ఇవి తమవైన  సొంత ఉత్పత్తి విధానం, శ్రమవిభజన, పనిముట్లు మరియు ఉత్పత్తి నైపుణ్యం, కిన్‌షిప్, ఉపకులాలు, సొంత కళారూపాలు అన్నీ కూడా తరతరాల మాతృ వ్యవస్థలు కలిగివుండడం వల్ల అనీ అందరికీ తెలిసిందే. ఇవన్నీ కూడా నిత్యం వ్యక్తి మరియూ సామాజిక చలనంలో మనకు దేశవ్యాప్తంగా తారసపడేదే. కాని మీడియా, అకడెమిక్, రాజకీయ పార్టీలు, వీటి ప్రజాసంఘాలు, హక్కుల సంఘాల చర్చల్లో సహా ఇవేవి ఉనికిలో లేనట్లుగా ప్రశ్నించేవారు లేనిచోటల్ల ఆనవాయితిగా  నడుస్తున్నవి. దళిత వాదం స్త్రీవాదం, మూలవాసీ వాదాల పట్ల ఈ రకమైన ఎక్సుక్లూషన్ వివక్ష గాంధీ కాలం నుండే ప్రధాన స్రవంతి ఎజెండాగా నడుస్తున్నది. దళితులపై, స్త్రీలపై, దళితస్త్రీలపై  పెచ్చుపెరుగుతున్న  దాడులు ఆత్యాచారాల మూలంగా మరియూ దళిత, స్త్రీల, మూలవాసీల చైతన్యం మూలాన ఇవి ప్రస్తుతం ప్రధాన శ్రవంతికి ఇష్టం లేకున్నా దేశవ్యాపితంగా ప్రధాన చర్చగా నడుస్తున్నది. ఈ చైతన్యాన్ని, దీని వాస్తవికతను గుర్తించకుండా గుడ్డిగా  వర్గవాదం పేరుతో అటు మీడియాలో, ఎకెడమీక్ డిబేట్‌లో అడ్డుకుంటూ వచ్చారు. కాని వాస్తవికతని గుర్తించనందున అటు రాజకియపరంగా , ఇటు ఎకడమీ పరంగా ప్రాభల్యాన్ని కోల్పోవడం, మరి  కొన్ని చోట్లా కనుమరుగు కావడం చూస్తున్నాం. అయినా వీరు వర్గవాదమే ప్రధానమంటూ బుకాయిస్తూ స్త్రీలను దళితులను మూలవాసులను ఇంకా  రెండవ తరగతి పౌరులుగా ఈ నాటికీ పరిగనిస్తూ బ్రాహ్మణియ మను మతం మత్తులో జోగుతూ సోషలిస్టులుగా చలామని అవుతూ ఈ వివక్షను పెంచుతున్నారు. స్త్రీల, దళితుల  అభ్యున్నతిని అడ్డుకుంటున్నారు. మతోన్మాదులకు అండదండగా ఉంటున్నారు. ఈ విషయంలో రెండాకులు ఎక్కువ చదివిన రైటిస్టులు మనువాద కమ్యునల్ ఎజెండాతో దేశవ్యాపితంగా స్త్రీల, దళితుల చైతన్యాన్ని అడ్డుకుంటున్నారు.

సరిగ్గా ఈ ప్రతికూల పరిస్థితులలో  శర్మిళారెగే  తనకు తాను ఫూలే-అంబేద్కర్‌వాద స్త్రీవాదినని నిర్వచించుకోవడం అశామాషి వ్యవహారం కాదని చెప్పాలి. అంతేకాక  దళిత వాద, స్త్రీవాద, దళిత స్త్రీవాద దృకోణంలో ఇండియా జాతీయ వాదాన్ని పునర్‌నిర్వచించాలని శర్మిళారెగే గొప్ప కృషి చేసింది. ఇందులో భాగంగానే “రైటింగ్ క్యాస్ట్, రైటింగ్ జెండర్, రీడింగ్ దళిత్ విమెన్స్ టెస్ట్‌మొనీస్”, “అగెనెస్టు ది మ్యాడ్‌నెస్ ఆఫ్ మను, ఐడియాలజి ఫైట్ అగెనెస్టు బ్రాహ్మణికల్ పెట్రియార్కి” మొదలైన క్రిటికల్ గ్రంధాలకు సంపాదకత్వం

వహించింది.

ముఖ్యంగా అకడమీలో సామాజిక శాస్త్ర రంగంలో ప్రధానంగా ఇంటలెక్చువల్ డిబేట్స్‌లో ఈనాడు ముందుకు తీసుకొచ్చిన వారిలో ప్రధానమైన వ్యక్తిగా శర్మిళారెగే కనిపిస్తుంది. ఈమే దేశంలో ప్రముఖ స్త్రీవాద రచయితగా, మేదావిగా, సామాజిక శాస్త్రవేత్తగా నిలిచింది. ఈమె పూనె యూనివర్సిటిలో1991నుండి జెండర్ స్టడీస్ డిపార్టుమెంటు హెడ్డుగా పనిచేస్తూ మహారాష్ట్ర దళిద, స్త్రీవాద ఉద్యమాలతో, సాహిత్యంతో కలిసి పయనించిది. ఎంతో మంది స్కాలర్స్‌తో పూలే-అంబేద్కరు సిద్దాలపై పరిశోధనలు చేయించగలిగింది. ఈమే తన రచనలద్వారా లేవనెత్తిన క్లాస్, కాస్టు, రిలీజియన్, సెక్సువాలిటి అనే అంశాలపై దేశవ్యాపితంగా చర్చ జరిగింది. జరుగుతూనే ఉన్నది. అంతేకాక స్త్రీవాదం, దళితవాదం, పర్యావరణవాదం, మరియూ మూలవాసి వాదాలలోని వివిధ కోణాలు ప్రధాన శ్రవంంతి ఎజెండా వాదాలకు ధీటుగా అగ్రభాగాన నిలబడినాయి. వివిధ సాహిత్య వ్యాసాంగ ప్రక్రియలు, పరిశోధనలకు ఎంపిక చేసుకున్న విస్తృతి, కమ్యూనిటీ, జెండర్‌ల పరంగా తమకు ఎదురైన వివక్షలు అవమానాలు, చీత్కారాలు, గోసలు, పరాయికరణలో భాగంగా వచ్చినవే. వ్యక్తిగా ఆత్మగౌరవంతో, కమ్యునిటీగా పూలే-అంబేద్కర్ సిద్దాంతాలతో శక్తివంతగా పనిచేయడానికి సావిత్రిబాయిని స్ఫూర్తిగా తీసుకుంది. కనుకనే క్రాంతిజ్యోతి సావిత్రిబాయిపూలే విమెన్స్ స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ఈనేపథ్యంలో శర్మిళ రెగె పోషించిన పాత్ర ఎంతో కీలక మయిందనే చెప్పాలి. శర్మిళా రెగే రచనలోని ఆలోచనలను సిద్ధాంతాలను విస్తరింపచేయడ, వాటితో పయనించడమంటే ఆమేకు నిజమైన నివాళు లు అర్పించడమే.